క్లుప్తంగా

కనకదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం


అమ్మవారికి గుడి ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బద్వేలు అర్బన్ : స్థానిక సబ్‌జైలు ఆవరణలోని శ్రీకనకదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవ మహోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా ఆలయంలోని కనకదుర్గాదేవి అమ్మవారి విగ్రహాన్ని సుందరంగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం 8:30 గంటల నుంచి గణపతిపూజ, పుణ్యావాచనం, అభిషేకములు, కుంకుమార్చనలు నిర్వహించి అనంతరం సామూహిక అర్చనలు నిర్వహించారు. అనంతరం గుడి ఉత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేదపండితులు ప్రదీప్‌కుమార్‌శర్మ బ్రహ్మత్వమున నిర్వహించబడిన పూజా కార్యక్రమాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దర్శిసుబ్బరాజ, వడ్లపూటినాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నూతన మసీదు ప్రారంభం


డిప్యూటీ సీఎంను సత్కరిస్తున్న మదీనా దస్తగిరి కుటుంబ సభ్యులు

మైదుకూరు : పట్టణంలోని ఉదయగిరి కాలనీలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి ఆధ్వర్యంలో నిర్మించిన నూతన మసీదు ఉల్ ఉస్మాన్ ను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మసీదులో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, వక్ఫ్ బోర్డు చైర్మన్ మదీనా దస్తగిరి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నేతలను మదీనా దస్తగిరి కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అని కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పంచాయతీ పరిధిలో మంజూరైన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లె పంచాయతీలో 5 సచివాలయాలు ఉండగా ప్రభుత్వం 6,273 ఆరోగ్యశ్రీ కార్డులను మంజూరు చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నాగలకుంట్ల సచివాలయం తనిఖీ


సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : మండలంలోని నాగలకుంట్ల సచివాలయాన్ని బుధవారం పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి 540 రకాల సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు లబ్ధిపొందే అవకాశం దేశంలో ఎక్కడా లేదన్నారు. 2024లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవడం ఖాయమన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం


మందులను అందచేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

ప్రొద్దుటూరు క్రైం : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఇంటికీ సంపూర్ణ ఆరోగ్యం అభిస్తోందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. పట్టణంలోని వైఎంఆర్‌కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్పెషలిస్టు వైద్యులు కీర్తిరెడ్డి, హేమలత, హిమబిందు, దినేష్‌బాబు, ఎంఎస్ తేజలు వైద్య సేవలు అందించారు. 386 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగశశిభూషన్‌రెడ్డి, డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, ఎపిడమాలజిస్టు ఖాజామొద్దీన్‌లు శిబిరాన్ని సందర్శించారు. వైద్య సేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్రా


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను పరిశీలిస్తున్న జేసీ గణేష్‌కుమార్


క్రీడాకారులతో ఎమ్మెల్యే రాచమల్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

మైదుకూరు : రాష్ట్రంలో యువతీ యువకుల్లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మైదుకూరులోని మేధా డిఫెన్స్ అకాడమీ మైదానంలో బుధవారం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడా పోటీల్లో పాల్గొని యువతీ యువకులు శారీరక, మానసిక ధారుఢ్యంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే అవకాశం పొందాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. నాగిరెడ్డి కాసేపు క్రికెట్ ఆటలో బౌలింగ్, బ్యాటింగ్ చేసి క్రీడా కారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, తహసీల్దారు అనురాధ, చాపాడు ఎంపీడీఓ నాయుడు, ఎంఈఓ పద్మలత, మైదుకూరు, దువ్వూరు ఏఓ లు లక్ష్మీదేవి, నాగేంద్రబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, పట్టణ అధ్యక్షులు కేపీ లింగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, కౌన్సిలర్లు వంకటసుబ్బన్న, వీరభద్రుడు, పిల్లి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

జేసీ పరిశీలన

మైదుకూరులో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ పరిశీలించారు. స్థానిక మేధా డిఫెన్స్ అకాడమీ మైదానంలో క్రీడా పోటీల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను నియోజకవర్గ ప్రత్యేక అధికారి చంద్రమోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. పోటీలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని వ్యాయామ ఉపధ్యాయులకు సూచించారు. జేసీ వెంట బద్వేలు ఆర్డీఓ వెంకటరమణ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రొద్దుటూరు: పిల్లలకు చదువుతో పాటు క్రీడలలో కూడా పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన జట్లను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం పిల్లలలో క్రీడా స్ఫూర్తి నింపేలా ఆలోచన చేయలేదన్నారు. క్రీడలకు పెద్దపీట వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. క్రీడల వల్ల శారీరక దారుఢ్యమే కాకుండా మానసిక దృఢత్వం కలుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ నిర్వహిస్తోందన్నారు. ఈ పోటీలలో నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన జట్లను ఆయన అభినందించారు. ఎన్నికల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రొద్దుటూరులో అందమైన స్టేడియాన్ని నిర్మించి పిల్లలకు అంకితం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, ఫిజికల్ డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నూతన భవనాలు ప్రారంభం

చాపాడు : మండలంలో పలు గ్రామాలలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ భవనాలను గురువారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించనున్నట్లు ఎంపీపీ లక్షుమయ్య తెలిపారు. ఉదయం 9గంటలకు ఖాదర్‌పల్లెలో విలేజ్ క్లినిక్, 9.30గంటలకు సీతారామాపురంలో కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ, 10గంటలకు చిన్నగురువళూరులో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలు, 10.30గంటలకు బద్రిపల్లెలో రైతు భరోసా కేంద్రం, 11 గంటలకు సోమాపురంలో రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ప్రారంభించనున్నట్లు ఎంపీపీ తెలిపారు.

నేటి నుంచి ఉత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మోడంపల్లె బైపాస్ రోడ్డులోని కేఎంహెచ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నుంచి రూబీ జూబ్లి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు బ్రహ్మకుమారి పావని బెహన్‌జి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మోక్షగుండం వీధి బ్రహ్మకుమారీస్ సేవాకేంద్రం ప్రారంభించి 40 ఏళ్లు అయిన సందర్భంగా, మోడంపల్లె ఓంశాంతి భవన్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు రోజుల పాటు ఈ రూబీ జూబ్లీ వేడుకలు జరుగుతాయన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


పట్టాలు అందుకున్న రైతులతో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, తదితరులు

దువ్వూరు : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఇనాము భూముల రైతులకు ఎమ్మెల్యే పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని.. అందులో భాగంగా రాష్ట్రంలోని రైతులు సాగు చేసుకుంటున్న వడ్రంగి, చాకలి, మంగలి, కుమ్మరి ఇనాము భూములపై రైతులకు పూర్తి హక్కులు కల్పించి పట్టాలు అందజేశామన్నారు. రైతులకు పంట ఇన్సూరెన్స్ ప్రభుత్వమే చెల్లించి పంట నష్టపోయిన రైతులకు భీమా అందించడంతోపాటు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా రైతులకు అందిస్తున్నామన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో మైదుకూరు నియోజకవర్గంలో దాదాపు రూ.100 కోట్లకు పైగా రైతులకు ఇన్సూరెన్స్ అందించడం జరిగిందన్నారు. ఇప్పటికే చుక్కల భూములు, డీకేటీ భూముల రైతులకు ఆ భూములపై పూర్తి హక్కులను రైతులకు జగన్ ప్రభుత్వం కల్పించిందన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు ఏ అవసరం ఉన్నా.. మండల వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని.. ప్రస్తుతం ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్దకే వ్యవసాయ సేవలు అందిస్తున్నామన్నారు. ఒక్క దువ్వూరు మండలంలోనే 1026 మంది ఇనాము భూముల రైతులకు 1041 ఎకరాలకు శాశ్వత హక్కులు కల్పించి పట్టాలు అందించడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కులం, మతం, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. వైఎస్సార్ ఆసరా ద్వారా డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల డ్వాక్రా రుణ మాఫీ చేసి వారి ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. 2019 నుంచి ఇప్పటివరకు మీకు, మీ కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా ఎంత లబ్ధి జరిగింది.. మీరే ఆలోచించుకోవాలన్నారు. ప్రజల కోసం అహర్నిశలు కష్టపడే సీఎం వైఎస్ జగన్‌ను మంచి మనస్సుతో మరోసారి ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ ఖానాల జయచంద్రారెడ్డి, తహసీల్దార్ రమా కుమారి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఖిరాకీ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మంచాల రాజగోపాల్ రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, కుంపటి ఖాజా పీర్, బందే ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే

ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి


ప్రొద్దుటూరు డ్వాక్రా రుణమాఫీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు నాలుగు దశలలో పూర్తిగా రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన మాటను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో బుధవారం వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా వారి ఖాతాలలో నగదు జమ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో 24వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణాలు చేపట్టామన్నారు. గత చంద్రబాబు పాలనలో ఏ ఒక్క కుటుంబానికి ఇంటి పట్టా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. పింఛన్ పంపిణీలో గత ప్రభుత్వానికి జగన్ ప్రభుత్వానికి గల వ్యత్యాసాన్ని గుర్తించాలన్నారు.

ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి

ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక 7వ వార్డులోని స్వరాజ్యనగర్‌లో రూ. 27 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న సీసీరోడ్డుకు బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ స్వరాజ్యనగర్‌లో సుమారు రూ. 90 లక్షల అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, కౌన్సిలర్లు గుర్రం లావణ్య, రాగులశాంతి, సత్యం, జిలాని, వైఎస్సార్‌సీపీ నాయకులు గుర్రం రవి ప్రకాష్, ప్రజలు పాల్గొన్నారు.

మెప్మా బజార్ ప్రారంభం

పట్టణ పరిధిలోని వైఎంఆర్ కాలనీలో ఆంజనేయ స్వామి గుడి వద్ద 3, 4, 5, 6 వార్డులకు సంబంధించి ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. మెప్మా బజార్‌ను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీదేవి, కమిషనర్ పీవీ రమణయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, రాయలసీమ పోలీసు కంప్లైంట్ అథారిటి సభ్యులు కాకర్ల నాగేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు కామిశెట్టి బాబు, పట్టణ అధ్యక్షురాలు కోనేటి సునంద తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే అభివృద్ధి

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 30 ఏళ్ల చరిత్రలో జరగని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ పాలనలోనే జరిగిందని మైనార్టీ నాయకులు షేక్ నూరి ఇదాయత్, కమాల్ బాషా, జిలానీ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ.. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని ప్రతిపక్ష టీడీపీ మైనార్టీ నాయకులు జబీఉల్లా వ్యాఖ్యానించటం సిగ్గు చేటన్నారు. టీడీపీ అధికారంలో ఉండగా ఒక్క అభివృద్ధి పనైనా చేసినట్లు చూపించగలరా అని ప్రశ్నించారు. మేమైతే వైఎస్సార్‌సీపీ పాలనలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి నేతృత్వంలో జరిగిన అభివృద్ధిని గర్వంగా చూపిస్తామని, దీనికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రొద్దుటూరులో రూ.150 కోట్లతో మంచినీటి సమస్య పరిష్కరించిన ఘనత ఎమ్మెల్యే రాచమల్లుకు దక్కుతుందన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులను అందచేస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3.5 లక్షల చెక్కులను ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ బుధవారం శ్రీరాముల పేటలోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల వైద్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారన్నారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందాలనే సదుద్దేశంతో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచారన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ముగ్గురికి చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోదరుడు ఆర్. ప్రసాద్, రాముడు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం సభ్యులు

బి.కోడూరు : మండలంలోని బి.కోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కాసానగరం వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో డీసీసీ బ్యాంకు బద్వేలు బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు సూపర్‌వైజర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉపకార వేతనాలను పొదుపు చేసుకోవాలని సూచించారు. అలాగే కిడ్డీ బ్యాంకు గురించి తెలియజేస్తూ ప్రతి విద్యార్థి బ్యాంకులో వంద రూపాయలతో అకౌంట్ ఓపెన్ చేసుకుంటే వారికి కిడ్డీబ్యాంకు ఒక బాక్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం కళాజాత బృందం సభ్యులు కళాజాత ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖోఖోలో జిల్లాస్థాయికి ఎంపికైన గోపవరం టీం


ఖోఖోలో జిల్లా స్థాయికి ఎంపికైన గోపవరం మహిళా టీం

గోపవరం : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బుధవారం నియోజకవర్గ స్థాయిలో జరిగిన క్రీడల్లో ఖోఖోలో గోపవరం మండలానికి చెందిన మహిళా జట్టు అట్లూరు జట్టుపై గెలిచి విజేతగా నిలిచింది. విన్నర్‌గా నిలిచిన టీం జిల్లా స్థాయిలో పాల్గొననున్నారు. గ్రామస్థాయిలోనూ, మండల స్థాయిలోనూ, నియోజకవర్గ స్థాయిలో వరుసగా ఖోఖోలో గోపవరం టీం విన్నర్స్‌గా నిలిచి జిల్లా స్థాయికి వెళ్ళడం పట్ల వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గోపవరం మల్లికార్జునరెడ్డి, గోపవరం డీడీఓ విజయకుమార్, పీడీ జిలానిబాషలు హర్షం వ్యక్తం చేశారు.

బాలికల విద్యను ప్రోత్సహించాలి


బాలికకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హనీఫ్‌బాబా

ప్రొద్దుటూరు క్రైం : బాలికల విద్యను ప్రోత్సహించాలని డాక్టర్ హనీఫ్‌బాబా తెలిపారు. వారికి ఆరోగ్యం, పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా హౌసింగ్‌బోర్డు కాలనీ అంగన్‌వాడి కేంద్రంలో బుధవారం బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాలను ప్రోత్సహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, సీహెచ్‌ఓ నాగేంద్ర, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి శ్రీ లక్ష్మి

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారతాధికారి శ్రీ లక్ష్మి పేర్కొన్నారు. సమగ్ర బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కడప నగర శివార్లలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదువులు చదివి గొప్ప పదవులు అధిరోహించాలన్నారు. బాలికలందరూ శ్రద్ధ పెట్టి పట్టుదలతో చదవాలని తద్వారా తల్లిదండ్రుల నమ్మకాన్ని పొందాలన్నారు. తల్లిదండ్రులు అబ్బాయి, అమ్మాయి అనే వివక్ష లేకుండా ఇద్దరినీ సమానంగా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, బాలల పరిరక్షణ అధికారి సుభాష్ యాదవ్, గురుకుల పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నిగ్రహశక్తిని పెంపొందించేలా చర్యలు

ప్రిన్సిపాల్ డా. జి.రవీంద్రనాథ్


మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్

వైవీయూ : చిన్నచిన్న విషయాలకే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరమని, విద్యార్థుల్లో నిగ్రహశక్తిని, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా అధ్యాపకులు కృషిచేయాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ సూచించారు. బుధవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో యునెస్కో, కళాశాల విద్య సంయుక్త ఆధ్వర్యంలో 'సెల్ఫ్ డైరెక్టెడ్ ఎమోషనల్ లెర్నింగ్ ఫార్ ఎంపతీ అండ్ కైండ్‌నెస్/సోషల్ ఎమోషనల్ లెర్నింగ్' అన్న అంశాలపై డిగ్రీ కళాశాల అధ్యాపకులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కుటుంబం, సమాజం పట్ల బాధ్యతగా మెలిగేలా చూడాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. మానసికంగా విద్యార్థులను ధృడంగా ఉంచేందుకు ప్రత్యేక మనోవికాస తరగతులు నిర్వహించాలని సూచించారు. వర్చువల్ విధానంలో కళాశాల విద్య కమిషనర్ డా. పోలా భాస్కర్, ఎంజీఐఈపీ ప్రతినిధి డా. శోభిత ప్రసంగించారు. వర్క్‌షాప్‌కు మెంటార్లుగా డా. సి. రమణారెడ్డి, డా. ప్రేమలత, శివమ్మ వ్యవహరించగా, ఎస్ఆర్‌సీ కోఆర్డినేటర్ డా. సుందరేశ్వరరావు, శ్రీనివాసులు, వైవీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

రహదారి నియమాలను పాటించండి


ప్రొద్దుటూరు క్రైం : విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : రహదారి నియమాలను పాటించాలని ఆర్టీఓ మురళీధర్, ట్రాఫిక్ సీఐ యుగంధర్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలు నడిపితే ప్రమాదాలు జరగవని చెప్పారు. అతి వేగం ప్రమాదకరమన్నారు. మైనర్లు బైక్‌లను నడపరాదని తెలిపారు. చిన్న పిల్లలకు బైక్‌లను ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సీఐ ఇబ్రహీం, ఎంవీఐ నారాయణ నాయక్, ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : బీజేపీ ప్రభుత్వం జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలైన రోడ్డు, రైల్వే, విమాన సౌకర్యంతో పాటు నీళ్లు, కరెంటు, 27 వేల ఎకరాల భూములు కలిగి ఉన్నప్పటికీ ఇవేవీ కేంద్ర ప్రభుత్వానికి కనిపించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, ఎన్. విజయలక్ష్మి, వి. వీరశేఖర్, కే.సి.బాదుల్లా, జి. వేణుగోపాల్, పి. భాస్కర్, కే. మునయ్య, మల్లికార్జున, వర్మ, నాగేశం, ఇమ్మానియేల్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఓ యువతా మేలుకో...


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : యువత చైతన్యవంతం అయినప్పుడే దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని జీవనజ్యోతి విద్యాసంస్థల కరస్పాండెంట్ వై.అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. నవ సమాజ నిర్మాణం కోసం భావితరాల ఉజ్వల భవిష్యత్ కోసం యువత, విద్యార్థులతో జీవనజ్యోతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వన్‌టౌన్ సర్కిల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ గాంధీరోడ్డు, విజయకుమార్ సర్కిల్, రాజీవ్ సర్కిల్, శివాలయం సర్కిల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలతో పెడతోవ పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే పిల్లలకు సెల్ ఫోన్ ఇవ్వడం వల్ల వారు దుర్వినియోగం చేయడంతో పాటు దానికి వ్యసనంగా మారుతున్నారన్నారు. మోటార్ సైకిళ్ల ట్రిపుల్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణమవడంతో పాటు తల్లిదండ్రులకు శోకం మిగిలిస్తున్నారన్నారు. యువత బెట్టింగులు, మద్యం, ధూమపానం వంటి చెడు అలవాట్లతో ఆరోగ్యాన్ని, జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారో కనిపెట్టుకుని ఉండాలని, ఎక్కడ తిరుగుతున్నారో గమనిస్తూ ఉండాలన్నారు. క్షణికానందం, క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుంటూ జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారని.. ఇది తగదన్నారు. తల్లిదండ్రుల శ్రమను, కష్టాన్ని గుర్తించి క్రమశిక్షణతో మెలిగి ఉన్నత మైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉజ్వల భవిష్యత్‌కు బాట వేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ ర్యాలీలో జీవనజ్యోతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు గురుదేవ్ రామిరెడ్డి, పలు జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా బందోబస్తు నిర్వహించారు.